క్లుప్తంగా

లింగాకర్షక బుట్టలతో మేలు



ముసుకుళ్ళ(తిరువూరు): పంటలను నాశనం చేసే క్రిమికీటకాల నుంచి రక్షణకు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలని మండల వ్యవసాయాధికారిణి పద్మ రైతులకు సూచించారు. మండలంలోని ముసుకుళ్లలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా బుధవారం మిత్ర, శత్రు పురుగుల గుర్తింపు, పంటచేలల్లో లింగాకర్షక బుట్టల ద్వారా జరిగే ఉపయోగాలను ప్రయోగాత్మకంగా వివరించారు. కాండం తొలుచు పురుగు ఉధృతి నివారణకు ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ సురేష్, రైతులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి



ఇబ్రహీంపట్నం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి అన్నారు. స్థానిక ఆక్స్‌ఫర్డ్ స్కూల్ వార్షిక క్రీడాపోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో ఏకాగ్రత పెరుగుతందన్నారు. మానసిక, శారీరక ఎదుగుదల క్రీడలతోనే సాధ్యమన్నారు. విద్యార్థులను నాలుగు విభాగాలుగా విభజించి క్రీడా పోటీలు నిర్వహించారు. అన్ని విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల రీజనల్ మేనేజర్ అమీనా, సిబ్బంది పాల్గొన్నారు.

సహాయ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



వర ప్రసాదరావు


నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం సహాయ కమిషనర్‌గా శ్రీరామ వరప్రసాదరావు బుధవారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. తిరుమలగిరి సహాయ కమిషనర్‌గా ఉన్న ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కె.శాంతి దీర్ఘకాల సెలవులో వెళ్లారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



రెడ్డిగూడెం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పెయ్యల హ్యాపి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు అర్హత సాధించాడు. కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని అర్హత సాధించినట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్ భిక్షాలు బుధవారం తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థి హ్యాపీని వ్యాయామ ఉపాధ్యాయురాలు సీహెచ్ ప్రమీల రాణి, ఉపాధ్యాయులు కేవీ చలపతిరావు, డీ ఎలిషారాజు, కేజేవీ భూషణంలు అభినందించారు.

కంచు గంట బహూకరణ



తిరువూరు: తిరువూరులో పునర్నిర్మించిన శ్రీకోదండ రామాలయానికి దాత కంచుగంట బుధవారం బహూకరించారు. ఈ నెల 5న పునఃప్రతిష్ట జరపనున్న ఆలయానికి ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగి గుడె రామారావు దంపతులు రూ.50 వేల విలువైన కంచుగంటను వితరణ ఇచ్చారు. కమిటీ ప్రతినిధులు సోమవరపు సత్యనారాయణ, ముత్తారావులకు గంటను అందజేశారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలను గ్రామ సచివాలయాన్ని బుధవారం ఎంపీడీఓ పిచ్చిరెడ్డి తనిఖీ చేశారు. సిబ్బంది తప్పని సరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని ఆదేశించారు. ఈ సేవ సర్వీసులు, సంక్షేమ పథకాలు, పబ్లిసిటీ, సామాజిక పింఛన్ల పంపిణీ, సిటిజన్ ఔట్రిచ్ సర్వే, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, జగనన్న పాల వెల్లువ తదితర పథకాలపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్షించారు.

పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు ప్రారంభం

తిరువూరు: స్థానిక శ్రీకోదండ రామాలయ పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. వేదపండితులు దివి ఉదయకుమారాచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, వాస్తు పూజ, వాస్తుహోమం, అంకురార్పణ, కళాపకర్షణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గృహ సారథులు సైనికుల్లా పనిచేయాలి

ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావుకు గృహ సారథుల జాబితాను అందజేస్తున్న చరణ్

నూజివీడు: పట్టణంలో వైఎస్సార్‌సీపీ గృహసారథుల నియామకంపై అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించడంతో వార్డు సచివాలయాల కన్వీనర్ పిళ్లా చరణ్‌ను ఎమ్మెల్యే మేక వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం అభినందించారు. పట్టణంలోని 32 వార్డుల్లోని 16 వార్డు సచివాలయాల పరిధిలో కౌన్సిలర్లు, నాయకులు సహకారంతో 604 మంది గృహ సారథులను నియమించి జాబితాను ఎమ్మెల్యే ప్రతాప్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు గృహ సారథులు సైతం వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు సైనికుల్లా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, నాయకులు కళ్లేపల్లి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

ఆగిరిపల్లి: దుగ్గిరాల బాలరావమ్మ ఆలయ అభివృద్ధికి నూతన పాలక మండలి సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని తోటపల్లిలో వేంచేసియున్న దుగ్గిరాల బాలరావమ్మతల్లి ఆలయ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో బుధవారం ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు. ఆలయ పాలక మండలి చైర్మన్‌గా వీరంకి వీరాంజనేయులు, వైస్ చైర్మన్‌గా దాసరి లక్ష్మీతో పాటు మరో 5 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారాన్ని ఆలయ ఈవో డి.శ్రీనివాసరావు చేయించారు. అనంతరం దాతల సహకారంతో, పాలక మండలి సభ్యుల సహకారంతో నూతనంగా నిర్మించిన పాలపొంగళ్ల షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బెజవాడ రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పామర్తి శివ, మండల ఇన్‌చార్జ్ మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.



అడవినెక్కలంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, పక్కన నాయకులు

వైభవంగా ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

ఆగిరిపల్లి: మండలంలోని అడవినెక్కలంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామ స్మరణ మధ్య ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరిగింది. ఈ మహోత్సవానికి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హాజరై ధ్వజస్తంభం వద్ద నవధాన్యాలు చల్లి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ హరిబాబు, నాయకులు మొక్కపాటి కిరణ్, వేము రాజు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ మొక్కపాటి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వీరబాబు, మాజీ సర్పంచి మొక్కపాటి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచి కొల్లిపర ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

వేకువ జామునే తలుపు తట్టిన పింఛన్

నూజివీడు: నూజివీడు పట్టణం, మండలంలో బుధవారం పింఛన్ల పంపిణీని వలంటీర్లు శరవేగంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆరుగంటల కల్లా పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తలుపు తట్టి వారిని లేపి పింఛన్లను అందజేశారు. దీంతో నూజివీడు మండలంలో 86 శాతం, నూజివీడు పట్టణంలో 86 శాతం పింఛన్లను తొలిరోజే పంపిణీ చేశారు. మండలంలో 10,493 పింఛన్లు ఉండగా తొలిరోజు 9036 పింఛన్లను పంపిణీ చేయగా, ఇంకా 1357 పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉంది. పట్టణంలో 5154 పింఛన్లకు తొలిరోజు 4431 పింఛన్లను అందజేయగా, ఇంకా 723 పింఛన్లను అందించాల్సి ఉంది. వేకువజామునే వచ్చి పింఛన్లను అందజేస్తుంటే వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, పలు వృత్తిదారులు, వితంతువుల మోముల్లో చిరునవ్వులు ప్రసరించాయి.



నూజివీడు పట్టణం ఎమ్మార్ అప్పారావు కాలనీలో పింఛన్ అందజేస్తున్న వలంటీరు



జూపూడిలో తెల్లవారుజామున పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి, వలంటీర్



ముసునూరులో పింఛను పంపిణీ చేస్తున్న వలంటీర్లు

మండలంలో 86.33 శాతం పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలం పరిధిలోని గ్రామాల్లో తొలిరోజే 86.33 శాతం పింఛన్‌లు పంపిణీ చేశారు. మొత్తం పది గ్రామాల్లో 4,726 మంది పింఛన్‌దారులు ఉండగా తొలిరోజు 4,080 మందికి అందజేసినట్లు ఎంపీడీవో రామకృష్ణనాయక్ తెలిపారు. కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని 29 వార్డుల్లో 5,147 మంది పింఛన్ దారులకు గాను 4,157 మందికి తొలిరోజు అందజేశారు. 81 శాతం పూర్తయినట్లు మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలియజేశారు.

తెల్లవారు జాము నుంచే ప్రారంభమైన పింఛన్ల పంపిణీ

మైలవరం: పింఛన్ల పంపిణీ తెల్లవారు జాము నుంచే ప్రారంభమైంది. మైలవరం మండలంలో బుధవారం ఒక్క రోజులో 82.39 శాతం పింఛన్లు పంపిణీ చేశారని ఎంపీడీఓ లక్ష్మీకుమారి తెలిపారు. మైలవరం మండలంలో తెల్లవారు జాము నుంచే లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వలంటీర్లు ప్రారంభించారన్నారు. మండలంలో 9627 మంది పింఛన్ లబ్ధిదారులున్నారు. వీరిలో 7932 మందికి పంపిణీ చేశారు. మండలానికి సంబంధించి 9627 మందికి గాను రూ.2,66,32,250 మంజూరు కాగా రూ.2,19,79,000 పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ లక్ష్మీకుమారి తెలిపారు.

విస్సన్నపేట: మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్ పింఛను కానుక ఆయా వలంటీర్లు లబ్ధిదారుల ఇంటివద్దకు వెళ్లి బుధవారం అందజేశారు. అన్ని గ్రామాల్లో ఇప్పటికి 90 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి అయిందని ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ తెలిపారు.

పొద్దు పొడవక ముందే..

ముసునూరు: పొద్దు పొడవక ముందే పింఛన్లు పేదింటి తలుపు తట్టాయి. మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామ వలంటీర్లు పింఛన్ల పంపిణీని బుధవారం తెల్లవారు జామునే ఆరంభించి వేగంగా పూర్తి చేశారు. పలు గ్రామాల్లో వలంటీర్లతో పాటు మండల, గ్రామ నేతలు, సచివాలయ కన్వీనర్లు పాల్గొని పింఛన్ నగదు రూ.2,750 పింఛన్ దారులకు అందజేశారు. మండలంలో మొత్తం పెన్షన్లు 7859 కాగా, మధ్యాహ్నం లోపే 87.87 శాతంతో 6,906 పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ గుంజి రాణి తెలిపారు.

89 శాతం పింఛన్ల పంపిణీ

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో 89 శాతం పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఎస్.మురళీమోహనరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 8527 పెన్షన్లకు 7540 పెన్షన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఆగిరిపల్లి: మండలంలోని వడ్లమానులో గురువారం సాయంత్రం 5 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హాజరవుతారన్నారు. లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేస్తూ సంక్షేమ పథకాలను వివరిస్తారు.

పేదలకు చీరలు పంపిణీ

నూజివీడు: పట్టణంలోని కనకం సబ్సిడీ వస్త్రాలయం ఆధ్వర్యంలో బుధవారం 150 మంది వృద్ధులకు వస్త్రాలయం యజమాని మిర్యాల కృష్ణకిషోర్ చీరలు పంపిణీ చేశారు. ఈ సంస్థ ఏర్పాటు చేసి 90 ఏళ్లు అయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణకిషోర్ మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అని నమ్మి ఈ సంస్థ స్థాపించిన నాటి నుంచి దానం చేస్తూ వస్తున్నామన్నారు. కార్యక్రమంలో మిర్యాల సుభద్రదేవి, మిర్యాల లీలా హేమమాలిని, పలువురు స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

నూజివీడు: ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి విద్యార్థి మంచి అలవాట్లు అలవర్చుకోవాలని స్థానిక ఏరియా ఆసుపత్రి వైద్యురాలు సౌమ్య సూచించారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఎత్తు, బరువులను కొలవడంతో పాటు రక్తపరీక్షలు, కోవిడ్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ ఆరోగ్యకరంగా జీవనం సాగించాలంటే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పరీక్షల అనంతరం దగ్గు, జలుబు, రక్తహీనతతో బాధపడే విద్యార్థులకు మందులు అందజేశారు.


4 నుంచి నాటకోత్సవాలు

మైలవరం: మైలవరంలో ఈ నెల 4 నుంచి బాలభారతీయ నాట్యమండలి నాటకోత్సవాలు జరుగుతాయని బాల భారతీయ నాట్యమండలి కమిటీ అధ్యక్షుడు దుర్వాసుల రామారావు తెలిపారు. మైలవరం కార్యాలయంలో రామారావు బుధవారం మాట్లాడుతూ 110 సంవత్సరాలు చరిత్ర కలిగిన శ్రీబాల భారతీయ నాట్యమండలిని 1912లో మైలవరం జమీందారు సూరానేని వెంకట పాపయ్యరావ్ బహదూర్ స్థాపించారని తెలిపారు. శ్రీబాల భారతీయ నాట్య మండలి కళాకారులను ప్రోత్సహిస్తూ నాటకాలను కొనసాగిస్తుందన్నారు. మైలవరంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం సందర్భంగా ఈనెల 4,5 తేదీల్లో రాష్ట్ర స్థాయి నాటికల ప్రదర్శన నిర్వహించనున్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం

తిరువూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి తెలిపారు. రేపు మధ్యాహ్నం తిరువూరు మండల, నగర పంచాయతీ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు హాజరు కావాలని కోరారు. ఎమ్మెల్యే రక్షణనిధి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

3169 ఎకరాల పంట నమోదు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి టిప్పు సుల్తాన్

ఎ.కొండూరు: రబీ సీజన్లో పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పని సరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి టిప్పు సుల్తాన్ పేర్కొన్నారు. ఎ.కొండూరులో బుధవారం రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 3169 ఎకరాల్లో పంట సాగు వివరాలు 1384 మంది రైతుల పేర్లు నమోదు చేసినట్లు తెలిపారు. దీనితో పాటు ఈ కేవైసీ కూడా తప్పనిగా చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకొని రైతులు ఈనెల 20వ తేదీ లోపు చేయించుకోవాలని, అప్పుడే సున్నా వడ్డీ, ఉచిత పంటల భీమా, పలు రకాల ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు.

అధికారుల సూచనలు పాటించండి

ఉద్యాన శాఖ అధికారి నరేంద్రకుమార్



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారి నరేంద్రకుమార్

ఎ.కొండూరు: మామిడి తోటలకు తేనే మంచు పురుగు ఉధృతి అధికంగా ఉందని దీని నివారణకు ఉద్యాన శాఖ సూచించే సలహాలు పాటించాలని ఉద్యాన శాఖ అధికారి బి. నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోలని కోడూరు గ్రామంలో తోటబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిపూత దశలో తేనే మంచుపురుగు ఉధృతి అధికంగా ఉండటం వల్ల రసాన్ని పీల్చి తేనే వంటి ప్రదార్థాన్ని విసర్జిస్తాయన్నారు. వీటి వల్ల శిలీంద్రాలు పెరిగి ఆకుల మీద మసిమంగు ఏర్పడి కిరణ జన్య సంయోగ క్రియ జరగక పూత మొగ్గలు పెరగవన్నారు. దీని నివారణకు క్లోరోఫైరిఫాస్ 2 ఎంఎల్, సల్ఫర్ 10 గ్రాములు, బోరాన్ రెండు గ్రాములు, లీటర్‌నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. తేనే మంచు పురుగు, తామర పురుగులు రెండు ఉన్నప్పుడు ఈమీడ క్లోఫ్రిడ్ 3 ఎంఎల్ వాడాలని, గంధకం బూడిద తెగుళ్లు రాకుండా కాపాడుతుందన్నారు. తోటల్లో సాయంత్రం వేళల్లో పొగబెట్టడం, తక్కువ లోతులో దుక్కులు దున్నడం వల్ల పూతలు రావటానికి ఎక్కువగా అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ సహాయకులు టి.రాజేష్, రైతులు పాల్గొన్నారు.

సామూహిక ఇమ్యూనైజేషన్



గంపలగూడెం ఆరోగ్య ఉప కేంద్రంలో ఇమ్యూనైజేషన్ చేస్తున్న సిబ్బంది

గంపలగూడెం: మండలంలో సామూహిక ఇమ్యూనైజేషన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఊటుకూరు, గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరిగింది. గర్భిణులు, బాలింతలు, 0–5 సంవత్సరముల లోపు చిన్నారులు, కౌమార పిల్లలకు డీపీటీ, ఐపీవీ, డీటీ, ఓపీవీ, ఎంఆర్ఎస్‌జేవీ, పీసీవీ, రోటా, పెంటా వైలెంట్ వ్యాక్సిన్ గడువు ప్రకారం వేశారు. వ్యాక్సిన్ తీసుకున్న వారికి ఇంటి వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆరోగ్య సిబ్బంది, అశ వర్కర్లు వివరించారు. నెలలో ప్రతి బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మండలంలోని ప్రజలు వినియోగించుకోవాలని వైద్యాధికారి కె.శ్రీనివాస్ తెలిపారు.

జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు విజ్ఞప్తి చేశారు. కలెక్టరు క్యాంపు కార్యాలయంలో కలిసి ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. విస్సన్నపేట మండలం పుట్రేలలోని ఉషోదయ ప్రాజెక్టులో ప్రభుత్వం మంజూరు చేసిన భూములను సాగుచేసే సన్న, చిన్నకారు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని కోరారు. తెల్లదేవరపల్లి రెవెన్యూలో తండా భూములను దేవదాయశాఖ నిషిద్ధ జాబితాలో చేర్చడం వలన పేదలు నష్టపోతున్నారని, వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు. గంపలగూడెం మండలం వినగడప తండాలో మొబైల్ సిగ్నలింగ్ లేక విద్యార్థులు, పెన్షన్‌దారులు ఇబ్బంది పడుతున్నందున సెల్ టవరు ఏర్పాటు చేయించాలని కోరారు.

అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నిక



అధ్యక్షుడిగా ఎన్నికైన పిచ్చయ్యను అభినందిస్తున్న సంఘ సభ్యులు

నూజివీడు: పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వలగాని పిచ్చయ్యను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన ప్రస్తుతం అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సంఘ అధ్యక్షుడు వడాలి మంగరాజు ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో సభ్యుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీఎం సింగ్ అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ, శీలం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాల నిలిపివేత

ఊటుకూరు(గంపలగూడెం): రైతుల నుంచి ఆరోపణల వస్తున్న నేపథ్యంలో గంపలగూడెం మండలం ఊటుకూరు కోరమండల్ ఎరువుల దుకాణం (మన గ్రోమోర్)లో విక్రయాలను నిలిపివేయాలని ఆదేశించినట్లు మండల వ్యవసాయ అధికారి బి.సాయిశ్రీ బుధవారం తెలిపారు. ప్రస్తుత తరుణంలో రైతాంగం నుంచి వివిధ పైర్లకు అవసరమున్న యూరియా 28–28–0 (కాంప్లెక్స్ ఎరువు) ఎరువులకు మంచి డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో ఆ ఎరువులు గ్రోమోర్‌లో నిల్వలు ఉన్నాయి. వీటిని రైతులకు విక్రయించేటప్పుడు కంపెనీకి సంబంధించిన ఇతర రకాలను తప్పని సరిగా తీసుకోవాలని నిబంధన పెడుతున్నారు. దీనికి తోడు స్థానిక రైతుల అవసరాలకు సక్రమంగా సరఫరా చేయకుండా ఇతర ప్రాంతాల వారికి ఇష్టానుసారంగా సరఫరా చేస్తున్నట్లు గ్రామానికి చెందిన పలువురు రైతుల నుంచి ఆరోపణలు ఉన్నాయి. దీంతో వ్యవసాయ అధికారి ఆ దుకాణానికి సంబంధించిన సిబ్బందిని విచారించామని తెలిపారు. రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎలాంటి అనుబంధాలను అంటగట్టకుండా నేరుగా ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు దుకాణంలో విక్రయాల నిలిపివేయాలని సిబ్బందికి ఏఓ సూచించారు.

మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష



బలివేలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ముసునూరు: భక్తులకు కల్పించే సౌకర్యమే ఉత్సవాలకు విజయం ఇస్తుందని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్, ఇన్‌చార్జ్ ఆర్డీఓ పెంచల కిషోర్ అన్నారు. తహసీల్దార్ దాసరి సుధ ఆధ్వర్యంలో బలివేలోని మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను బుధవారం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలివే రామలింగేశ్వర స్వామిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణ చరిత్ర, స్వామి మహిమలు అడిగి తెలుసుకున్నారు. ఆలయ కమిటీ అధికారులు ఆలయ మర్యాదలతో గౌరవించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఎంపీడీఓ జి.రాణి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, పర్యవేక్షకుడు సాయిరాము, కార్యదర్శి యోహాన్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసీ దళార్చన

నెమలి(గంపలగూడెం): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు, అర్చక బృందం స్వామికి లక్ష తులసీ దళాలతో విశేష అర్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాజ్యలక్ష్మీదేవికి దశ సహస్ర కుంకుమార్చన చేశారు. ఏకాహ దీక్షతో హరేరామ నామ సంకీర్తన జరిపారు. అనంతరం శ్రీకృష్ణ తారక మహాహోమం, శాంతి హోమా లను నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ డి.శ్రీరామ వరప్రసాదరావు, పాలకవర్గ సభ్యులు నూకల నాగ లక్ష్మణరావు, వెంకటకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక షాబూఖారీ దర్గా



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెల్లంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా, తదితరులు



షాబూఖారీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న సీపీ కాంతి రాణా టాటా

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): హజ్రత్ సయ్యద్ షాబూఖారీ బాబా దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా అన్నారు. దర్గా 426వ ఉరుసు ఉత్సవాల్లో బుధవారం వారు వేర్వేరుగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. బాబా వారికి చాదర్ సమర్పించారు. ఆస్థాన పీఠాధిపతి, సూఫీ మతగురువు మహ్మద్ ఆల్తాఫ్ రజా సాదరంగా ఆహ్వానం పలికారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నిత్యం జరుగుతున్న అన్నదాన కార్యక్రమాన్ని కొనియాడారు. వేడుకల్లో ఎమ్మెల్సీ రుహుల్లా, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఖాజా, హిస్టరీ, అకాడమీ డైరెక్టర్ వాజీద్‌ఖాన్, 54వ డివిజన్ కార్పొరేటర్ హర్షద్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

బాలోత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ

నూజివీడు: విజయవాడలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అమరావతి బాలోత్సవ్‌లో పట్టణానికి చెందిన త్రివిధ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ బుధవారం తెలిపారు. క్విజ్ సీనియర్స్, జానపద నృత్యం జూనియర్స్, కార్టూన్ గీయడం జూనియర్స్, పద్యం–భావం జూనియర్స్, వ్యాసరచన సీనియర్స్, తెలుగు రైమ్స్ సబ్ జూనియర్స్ విభాగాల్లో ప్రథమ స్థానాల్లో నిలిచారన్నారు. వ్యర్థంతో అర్థం సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ద్వితీయ స్థానాల్లో, వక్తృత్వం సీనియర్స్, కథారచన జూనియర్స్, వక్తృత్వం జూనియర్స్, కథలు చెప్పడం సబ్ జూనియర్స్ విభాగాల్లో తృతీయ స్థానాల్లో నిలిచినట్లు పేర్కొన్నారు.